
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 25 । మార్చి । 2023



చీనీ టన్ను రూ.30 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి. మార్కెట్‌కు 79 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.23
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.23, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.7.50 పలికింది.



రంజాన్ వేళలు

శనివారం	ఆదివారం
ఇఫ్తార్	సెహరి
6.33	5.03

న్యూస్‌రీల్

27లోపు ధ్రువపత్రాలు సమర్పించాలి

ప్రశాంతి నిలయం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్(2022–23)కు ఎంపికైన జిల్లాలోని 8వ తరగతి విద్యార్థుల వివరాలకు సంబంధించిన ధ్రువపత్రాలు 27వ తేదీలోపు సమర్పించాలని డీఈఓ మీనాక్షి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థుల వివరాలు ఇప్పటికే ఆయా పాఠశాలలకు పంపామన్నారు. ఆయా పాఠశాల యాజమాన్యాలు విద్యార్థుల కుల, ఆదాయ (రూ.3.5 లక్షల్లోపు) ధ్రువ పత్రాలు, 2021–22 సంవత్సరంలో విద్యార్థి 7వ తరగతిలో సాధించిన మార్కుల వివరాలను డీఈఓ కార్యాలయంలో సమర్పించాలన్నారు. విద్యార్థి దివ్యాంగులైతే సంబంధిత సర్టిఫికెట్ తప్పనిసరి అన్నారు. విద్యార్థి ఆధార్ ప్రకారం పేరు , పుట్టిన తేదీ, తండ్రి పేరు క్షుణ్ణంగా పరిశీలించి తప్పుల్లేకుండా వివరాలు పంపాలని సూచించారు.

హత్య కేసులో పదేళ్ల జైలు



ధర్మవరం రూరల్: దంపతుల మధ్య జరిగిన వివాదాన్ని పంచాయితీలో పరిష్కరిస్తుండగా జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి మృత్యువాత పడగా, నిందితుడికి పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ అనంతపురం మొదటి అదనపు జిల్లా జడ్జి ఎస్.రమేశ్ శుక్రవారం తీర్పు చెప్పారు. ధర్మవరం రూరల్ ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు...ధర్మవరం మండలం నిమ్మలకుంట గ్రామానికి చెందిన రమావత్ రమేష్ నాయక్‌కు వజ్రకరూరు మండలం పెద్ద వెంకటంపల్లితండాకు చెందిన సోమ్లా నాయక్ కూతురు మంజుబాయితో 2016లో వివాహమైంది. కొద్ది రోజులకే దంపతుల మధ్య మనస్పర్థలు వచ్చాయి. వీటిని పరిష్కరించేందుకు మంజుబాయి కుటుంబ సభ్యులు 2016 సెప్టెంబర్ 13న నిమ్మలకుంట గ్రామానికి వచ్చి పెద్ద మనుషులతో పంచాయితీ పెట్టించారు. పంచాయితీ జరుగుతున్న సమయంలోనే ఇరు కుటుంబాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో రమావత్ రమేష్ నాయక్‌ను భార్య తరఫు వారు చుట్టుముట్టి కొడుతుండగా అతని తమ్ముడైన మోతిలాల్ నాయక్ విడిపించేందుకు వెళ్లాడు. దీంతో తిరుపాల్‌నాయక్ అనే వ్యక్తి అక్కడే ఉన్న ఐరన్ బాక్స్(ఇస్త్రీపెట్టె)తో మోతీలాల్ నాయక్ తలపై మోదాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం ధర్మవరం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మోతిలాల్ నాయక్ 2016 అక్టోబర్ 11న మృతి చెందాడు. ఈ కేసులో ఏ–1గా మూడే సోమ్లా నాయక్, ఏ–2గా మూడే రమణాబాయి, ఏ–3గా రమావత్ మంజు, ఏ–4గా మూడే తిరుపాల్ నాయక్ అలియాస్ తపాల్‌నాయక్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం ఈ కేసును విచారించిన న్యాయమూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించిన తర్వాత మొదటి ముగ్గురు ముద్దాయిలపై కేసు కొట్టివేశారు. నాలుగో ముద్దాయి తిరుపాల్ నాయక్ అలియాస్ తపాల్‌నాయక్‌కు పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్, చిత్రంలో అగ్రి బోర్డు చైర్మన్ రమణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: రానున్న ఖరీఫ్‌లో రైతులు చిరుధాన్యాలు సాగు చేసేలా ప్రోత్సహించాలని కలెక్టర్ బసంత్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో జిల్లా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయాలని అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి కోరారు. అలాగే ఈ–క్రాప్ నమోదుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందేలా చూడాలన్నారు. అలాగే మార్కెట్‌లో గిట్టుబాటు ధర ఉన్న పంటల గురించి రైతులకు తెలియజేసి వాటి సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. అనంతరం రానున్న ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పంటల బీమా నమోదు తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన సమస్యలను అధికారులు పరిష్కరించాలన్నారు. ఆర్‌బీకేల్లో ఏ యంత్రం ఎంత ధరకు అద్దెకు ఇస్తున్నారనే వివరాలను ప్రదర్శించాలన్నారు. నాబార్డు ద్వారా గ్రామాల్లో రైతులకు వ్యవసాయ అనుబంధ రంగాల సేవలను తెలియజేయాలన్నారు.

జ్యోతులందుకో జగజ్జననీ



అమ్మవారికి జ్యోతులు తీసుకెళ్తూ నృత్యాలు చేస్తున్న దీక్షాధారులు (ఇన్‌సెట్) విశేషాలంకరణలో చౌడేశ్వరీదేవి మూలవిరాట్



హిందూపురం: ముదిరెడ్డిపల్లిలో వెలసిన తొగట వీరక్షత్రియుల ఆరాధ్యదైవం చౌడేశ్వరీదేవి 18 జ్యోతుల మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. తెల్లవారుజామునే అర్చకులు మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పట్టుచీరలు, వెండి ఆభరణాలు, విశేష పుష్పాలతో అమ్మవారిని అలంకరించారు. తెల్లవారుజాము 3 గంటల నుంచే అమ్మవారి దీక్షబూనిన భక్తులు పంచమి జ్యోతులను తలపై ఎత్తుకుని ఆలయం వద్ద నుంచి వీధుల గుండా నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. స్థానిక యువకులు కూడా రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ ముందుకు సాగారు. జ్యోతుల ఉత్సవం సందర్భంగా ముదిరెడ్డిపల్లి ప్రాంతమంతా జాతరను తలపిస్తూ పండుగ వాతావరణం సంతరించుకుంది. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ నాగభూషణరెడ్డితో పాటు మరికొందరు భక్తులకు మజ్జిగ, తాగునీరు అందజేశారు. స్థానికులు చౌడేశ్వరీ అమ్మవారికి కోళ్లు, గొర్రెలను సమర్పించి తమ బంధువులు, సన్నిహితులకు విందు ఇచ్చారు. అంతకుముందు హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కౌన్సిలర్ జయరాములు, మహాలక్ష్మి, ఆలయ కమిటీ నాయకులు బండారు బాలాజీ, నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగభూషణరెడ్డి, మనోహర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతుల ఉత్సవంలో పాల్గొన్న చైర్‌పర్సన్ ఇంద్రజ



ఊరేగింపులో వేషధారుల విన్యాసాలు

కోత కోసేశారు!



- పక్కా కమర్షియల్..
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్‌కే మొగ్గు
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో కాసుల కోసం కక్కుర్తి

బిడ్డకు జన్మనివ్వడం అంటే ప్రతి తల్లికీ పునర్జన్మ వంటిదే. సాధారణ పద్ధతిలో కాకుండా శస్త్రచికిత్స ద్వారా బిడ్డకు జన్మనివ్వడాన్ని సిజేరియన్ లేదా సీ – సెక్షన్ డెలివరీ అంటారు. సాధారణ పద్ధతిలో డెలివరీ జరగడం కష్టం అనుకున్నప్పుడు తల్లి, బిడ్డ ప్రాణాలను రక్షించడానికి సిజేరియన్ చేస్తారు. అయితే కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు సాధారణ ప్రసవాలకు అవకాశం ఉన్నా కాసుల కోసం.. లేనిపోని భయాందోళనలు సృష్టించి సిజేరియన్ ఆపరేషన్‌కు ఒప్పిస్తున్నాయి.

సాక్షి ప్రతినిధి, అనంతపురం:

- గుత్తి మండలానికి చెందిన లక్ష్మీదేవి గత బుధవారం పురిటినొప్పులు రాగానే అనంతపురంలోని ఓ ప్రైవేటు నర్సింగ్‌హోంకు వచ్చింది. నాలుగు గంటల వ్యవధిలోనే ఆమెకు సిజేరియన్ చేసి కాన్పు చేశారు.
- ఉవరకొండకు చెందిన 21 ఏళ్ల సుల్తానా రజియా రెండో కాన్పు కోసం అనంతపురం వచ్చింది. మొదటి కాన్పు సుఖప్రసవం అయినా రెండో కాన్పులో మాత్రం ఆ అవకాశం లేదని నర్సింగ్ హోం డాక్టర్లు సిజేరియన్ చేశారు.

సుఖప్రసవం జరిగి తల్లీ బిడ్డ క్షేమంగా, ఆరోగ్యంగా ఉండాలనేది ప్రభుత్వ ఆకాంక్ష. దీని కోసం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ప్రభుత్వాస్పత్రిలోనూ అవసరమైన అన్ని వసతులూ కల్పించింది. సిజేరియన్ ప్రసవాలు అత్యవసరమైతేనే చేయాలని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. కానీ ప్రైవేటు ఆస్పత్రులు యథేచ్ఛగా కోత కాన్పులు (సిజేరియన్లు) చేస్తూనే ఉన్నాయి. పేషెంటు రావడమే ఆలస్యం... ఏదో ఒక కారణం చెప్పి సిజేరియన్ ప్రసవం చేస్తున్నారు. సిజేరియన్ ద్వారా ప్రసవం చేయడం అటు తల్లికీ బిడ్డకూ మంచిది కాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ పదే పదే హెచ్చరిస్తున్నా ప్రైవేటు ఆస్పత్రుల్లో కోతల ప్రసవాలకు నియంత్రణే లేకుండాపోతోంది.



రాయదుర్గం ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులు (ఫైల్)

వ్యాపారంగా మారిన ప్రసవాలు

ప్రసవాలు పక్కా వ్యాపారమయ్యాయి. సాధారణ ప్రసవమైతే నర్సింగ్‌హోంలో రూ.10 వేలు కూడా బిల్లు కాదు. అదే సిజేరియన్ అయితే ఆస్పత్రి శ్రేణులను బట్టి రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకూ వసూలు చేస్తారు. మూడు రోజులు ఇన్‌పేషెంటుగా ఉంటే కనిష్టంగా రూ.50వేలు వేయొచ్చు. దీనికోసమే ఎక్కువ నర్సింగ్ హోంలలో సిజేరియన్ ప్రసవాలకే మొగ్గుచూపుతున్నారు.

అనవసరంగా సిజేరియన్ చేయొద్దు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిజేరియన్ చేశామంటే దానికి ఆడిట్ జరుగుతుంది. కారణం కచ్చితంగా చెప్పాలి. అందుకే ప్రభుత్వాస్పత్రుల్లో విధిలేకపోతే తప్ప సిజేరియన్ చేయం. ప్రైవేటు ఆస్పత్రులకు కూడా నియంత్రణ ఉంది. డీఎంహెచ్‌ఓ పర్యవేక్షణలో ఉంటుంది. ఎవరైనా సరే ప్రత్యేక కారణం లేకుండా సిజేరియన్ ప్రసవం చేయకూడదు.

–డాక్టర్ కృష్ణవేణి, జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయకర్త (డీసీహెచ్ఎస్)

ప్రభుత్వాస్పత్రుల్లోనే సుఖ ప్రసవాలు

ప్రైవేటు ఆస్పత్రుల్లో సిజేరియన్లతో పాటు భారీస్థాయిలో బిల్లులు వసూలు చేస్తారు. ప్రభుత్వాస్పత్రుల్లో అయితే ఉచితంగా వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. గర్భిణిని ఇంటి నుంచి ఆస్పత్రికి తీసుకురావడంతో పాటు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సుఖప్రసవం చేయిస్తారు. ఆ తర్వాత సురక్షితంగా తల్లీబిడ్డను ఇంటి వరకు చేరుస్తారు.

– ఎస్‌వీ కృష్ణారెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి

అనంతపురం జిల్లాలో 2022 ఏప్రిల్ నుంచి 2023 ఫిబ్రవరి వరకు ప్రసవాలు	
ఆస్పత్రుల్లో మొత్తం ప్రసవాలు	35,005
ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు	11,701
సిజేరియన్ ప్రసవాలు	3,849
సిజేరియన్ ప్రసవాల శాతం	32.89
ప్రైవేటులో జరిగిన ప్రసవాలు	23,304
సిజేరియన్ ప్రసవాలు	10,360
సిజేరియన్ ప్రసవాల శాతం	44.46

శ్రీసత్యసాయి జిల్లాలో 2022 ఏప్రిల్ నుంచి 2023 ఫిబ్రవరి వరకు ప్రసవాలు	
ఆస్పత్రుల్లో మొత్తం ప్రసవాలు	20,142
ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు	4,798
సిజేరియన్ ప్రసవాలు	766
సిజేరియన్ ప్రసవాల శాతం	15.96
ప్రై వేటు ఆస్పత్రుల్లో ప్రసవాలు	15,344
సిజేరియన్ ప్రసవాలు	7,545
సిజేరియన్ ప్రసవాల శాతం	49.17

సిజేరియన్ డెలివరీతో నష్టాలు

- డెలివరీ సమయంలో తల్లికి ఎక్కువగా రక్తస్రావం జరుగుతుంది.
- సిజేరియన్ గాయం వల్ల తల్లికి భవిష్యత్‌లో ఇతర సమస్యలు రావచ్చు.
- ఒక్కోసారి ఇన్ఫెక్షన్లు సోకితే తల్లికి ఎక్కువ ప్రమాదం ఉంటుంది.
- సాధారణ ప్రసవమైతే వెంటనే శిశువుకు తల్లిపాలు వస్తాయి. సిజేరియన్ అయితే ఆలస్యం కావచ్చు.
- సిజేరియన్ ప్రసవం వల్ల శిశువుకు శ్వాసకోశ సమస్యలు రావచ్చు.
- ఒకసారి సిజేరియన్ అయితే రెండోసారి గర్భం దాల్చినప్పుడు మరిన్ని సమస్యలుంటాయి.
- సిజేరియన్ వల్ల దీర్ఘకాలంలో వెన్నుపూస సమస్యలు లేదా ఊబకాయం వచ్చే అవకాశం ఎక్కువ.

'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



పదో తరగతి పరీక్షల నిర్వహణపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

నల్లమాడ: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బసంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన నల్లమాడలోని ఎస్టీ ఆశ్రమ ఉన్నత పాఠశాల, కస్తూర్బా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...25,881 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనుండగా, వీరి కోసం 125 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానుండగా, ఆలోపే ఏర్పాట్లన్నీ పూర్తి కావాలన్నారు. కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, విద్యుత్ సరఫరా, బల్లలు, ఫ్యాన్‌లు ఏర్పాటు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్ బసంత్‌కుమార్ ఎస్టీ ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులతో మాట్లాడారు. బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఆయా పాఠశాలల హెచ్ఎంలు రమణప్ప, సతీష్, శోభారాణి, అధికారులు పాల్గొన్నారు.

నేడే ఖాతాల్లోకి 'వైఎస్సార్ ఆసరా'

పుట్టపర్తి అర్బన్: 'వైఎస్సార్ ఆసరా' మూడో విడత మొత్తం అర్హుల బ్యాంకు ఖాతాల్లో శనివారం జమ అవుతుందని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. శనివారం ఏలూరు జిల్లా దెందలూరులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి నగదు ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ బసంత్‌కుమార్, ప్రజాప్రతినిధుల, ఆసరా లబ్ధిదారులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. జిల్లాలోని 28,127 సంఘాల్లోని 2,77,574 మంది సభ్యులకు మూడో విడత 'వైఎస్సార్ ఆసరా' కింద రూ.216.55 కోట్లు నగదు ఖాతాల్లో జమ కానున్నట్లు ఆయన వెల్లడించారు.

అత్తార్‌కు అవమానం!

అత్తార్ చాంద్‌బాషా పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా తయారైంది. వైఎస్సార్ సీపీ తరఫున గెలిచి టీడీపీ పంచన చేరినా... ఆపార్టీ నేతలు ఆయన్ను పెద్దగా పట్టించుకోవడం లేదు. కదిరి టికెట్ సంగతి దేవుడెరుగు... కనీసం మాట్లాడేందుకు మైక్ కూడా ఇవ్వడం లేదు. నారా లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్రలోనూ ఇది తేటతెల్లమైంది.

- 'యువగళం'లో కందికుంటకే ప్రాధాన్యం
- చాంద్‌ను పట్టించుకోని నారా లోకేష్
- 2024లో కదిరి టీడీపీ టికెట్ కందికుంటకేనా?

కదిరి: టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఈ నెల 17న సాయంత్రం 5 గంటలకు కదిరి నియోజకవర్గంలో ప్రవేశించి మూడు రోజులు కొనసాగింది. పాదయాత్ర ఆద్యంతం టీడీపీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందికుంట వెంకట ప్రసాద్‌కే లోకేష్ అధిక ప్రాధాన్యత ఇచ్చారు. కదిరి నుంచి టీడీపీ టికెట్ ఆశిస్తున్న అత్తార్ చాంద్‌బాషాను పూర్తిగా పక్కనపెట్టారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున కదిరి ఎమ్మెల్యేగా గెలుపొంది చాంద్‌బాషా ఆ తర్వాత డబ్బు, మంత్రి పదవి టీడీపీలో చేరారు. పార్టీలో చేరే వరకూ 'చాంద్‌మామ' రావేనంటూ జోలపాడిన టీడీపీ అధినేత ఆతర్వాత ఆయన్ను పూర్తిగా పక్కనపెట్టారు.

మొదటి రోజే అవమానం

లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్ర ఈ నెల 17న సాయంత్రం అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గం నుంచి శ్రీసత్యసాయి జిల్లాలోని కదిరి నియోజకవర్గం చీకటిమానిపల్లిలోకి ప్రవేశించింది. ఆ సమయంలో లోకేష్‌కు అత్తార్ చాంద్‌బాషా వర్గం ఘన స్వాగతం పలికింది. అదే సమయంలో కందికుంటతో పాటు పరిటాల శ్రీరామ్ వర్గీయులూ ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా టీడీపీకి చెందిన ఒక కార్యకర్త గజమాల తీసుకొచ్చి లోకేష్ మెడలో వేయగా, ఆయన వెంటనే దాన్ని తీసి పక్కనే ఉన్న కందికుంట మెడలో వేశారు. ఈయనే మీ కదిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి అని చెప్పకనే చెప్పారు. అక్కడే ఉన్న అత్తార్ చాంద్‌బాషా వర్గం దీన్ని జీర్ణించుకోలేక పోయింది.

మైక్ ఇచ్చింటే ఒట్టు

నల్లచెరువు మండలం జోగన్నపేట వద్ద జరిగిన బహిరంగ సభలో లోకేష్‌తో పాటు కందికుంట ప్రసాద్ మాత్రమే పార్టీ కార్యకర్తలు, ప్రజలనుద్దేశించి మాట్లాడారు. తర్వాత అత్తార్ చాంద్‌బాషాకు మైక్ ఇవ్వాలని ఆయన వర్గీయులు గట్టిగా అరిచినప్పటికీ... లోకేష్ ఏమాత్రం పట్టించుకోకుండా సమావేశాన్ని ముగించారు. దీనికి తోడు అదే వేదికపై లోకేష్ కందికుంట చేయి పట్టుకొని పైకెత్తి ఈయనే మీ అభ్యర్థి అనే అర్థం వచ్చే విధంగా వ్యవహరించారు. దీన్ని చూసి అత్తార్ వర్గానికి మరింత కోపమొచ్చింది. తర్వాత ఈ నెల 20న (సోమవారం) కదిరి పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో లోకేష్ సారథ్యంలో ఉదయం బీసీ సదస్సు, మధ్యాహ్నం మైనార్టీ సదస్సులు నిర్వహించారు. బీసీ సదస్సులో అత్తార్‌కు ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వలేదు. కనీసం మైనార్టీ సదస్సులోనైనా అత్తార్‌కు మాట్లాడే అవకాశం ఇస్తారని అందరూ ఊహించారు. కానీ అక్కడా అవకాశం ఇవ్వలేదు. దీంతో అత్తార్ వర్గం మరింత ఢీలా పడింది. అదే విధంగా దారి పొడవునా అత్తార్ వర్గం ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తే కందికుంట వర్గం అడుగడుగునా అడ్డు తగిలింది. ఎక్కడా చాంద్ ఫ్లెక్సీలు కనబడకుండా వారు చేసిన ప్రయత్నాలు ఫలించాయి.



కదిరి టీడీపీ అభ్యర్థి ఈయనే అన్నట్టు కందికుంట చేయి పైకెత్తి సంకేతాలిస్తున్న లోకేష్

ముస్లింలకు జరిగిన అవమానం

లోకేష్ యువగళం పాదయాత్రలో అత్తార్ చాంద్‌బాషాకు ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వలేదని భావించిన ఆయన అనుచరుల్లోని కొందరు ముస్లింలు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. 'ఇది చాంద్‌కు జరిగిన అవమానం కాదు..మొత్తం ముస్లింలందరికీ జరిగిన అవమానంగా భావిస్తున్నాం' అని వారంటున్నారు. చాంద్‌బాషాకు మంత్రి పదవి ఇస్తామని, అలాగే 2019 ఎన్నికల్లో టీడీపీ కదిరి టికెట్ మళ్లీ చాంద్‌కే ఇస్తామని చెప్పి చంద్రబాబు మోసగించారని, ఇప్పుడు మళ్లీ ఆయన తనయుడు లోకేష్ ఇలా అత్తార్‌ను అవమానించడం దేనికి సంకేతం? అని వారు ప్రశ్నిస్తున్నారు. మరి 2024 ఎన్నికల్లో కదిరి టికెట్ అత్తార్‌కు ఇవ్వనట్లేనా? అని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కందికుంటపై ఉన్న కేసుల కారణంగా ఆయన ఎన్నికల బరిలోకి దిగేందుకు సాంకేతిక కారణాలు తలెత్తితే ఆయన సతీమణి కందికుంట యశోదమ్మకు కదిరి టికెట్ ఖాయం..అని కందికుంట వర్గం ధీమా వ్యక్తం చేస్తోంది. ఈ పరిస్థితుల్లో అత్తార్ పరిస్థితి అగమ్యగోచరమైంది.

ఇంటర్ పరీక్షలకు 485 మంది గైర్హాజర్

ప్రశాంతి నిలయం: ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులకు గణితం–2బీ, జువాలజీ–2, హిస్టరీ –2, ఒకేషనల్ విద్యార్థులకు పేపర్–2 పరీక్షలు జరిగాయి. జనరల్ విద్యార్థులు 22,057 మందికి గాను 21,663 మంది హాజరుకాగా, ఒకేషనల్‌కు సంబంధించి 2,391 మందికి గాను 2,300 మంది హాజరయ్యారు. రెండు విభాగాలకు కలిపి 485 మంది గైర్హాజరయ్యారు.

క్లుప్తంగా

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి



అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: క్షయ వ్యాధి నివారణపై విస్తృతస్థాయిలో అవగాహన కల్పించి వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ బసంత్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2030 నాటికి క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృసి చేయాలన్నారు. వలెంటీర్లు, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంల ద్వారా క్షయ వ్యాధి పై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో గుర్తించిన 1400 మంది క్షయ వ్యాధి బాధితులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తున్నామన్నారు. జిల్లాలో 114 మంది వ్యాధిగ్రస్తులను విశ్వనాథ ఫౌండేషన్ దత్తతకు తీసుకుందని, మరికొందరు ముందుకు రావాలన్నారు. అనంతరం వైద్య సిబ్బంది రవిశంకర్‌రెడ్డి, భువనేశ్వరి, నాగేశ్వరి, అమృత, బాలాజీ నాయక్‌లను సన్మానించారు. అంతకు ముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

కల్లు దుకాణాలపై దాడులు

పరిగి: మండలంలో కల్లు విక్రయ దుకాణాలతో పాటూ కొడిగెనహళ్లిలో ఉన్న కల్లు తయారీ డిపోపై అనంతపురం ఎక్సైజ్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అన్నపూర్ణ దాడులు నిర్వహించారు. తొలుత కల్లు తయారీ డిపోలో తయారు చేసిన కల్లును పరిశీలించి, అక్కడే మినీకిట్ ద్వారా అందులోని మత్తు పదార్థాలను (క్లోరో హైడ్రేట్ రసాయనం) పరీక్షించారు. కల్లు తయారీ కేంద్రంలో సేకరించిన శాంపిళ్లకు పరీక్షలు నిర్వహించామని, అయితే అందులో ఎలాంటి మత్తు పదార్థాలు ఉన్నట్లు నిర్ధారణ కాలేదని సీఐ పేర్కొన్నారు.

'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

- ఏప్రిల్ 3 నుంచి పరీక్షలు
- పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- నో సెల్‌ఫోన్ జోన్‌లుగా పరీక్షా కేంద్రాలు
- 144 సెక్షన్ అమలు, జిరాక్స్, నెట్‌సెంటర్ల మూత



జిల్లా విద్యాశాఖ కార్యాలయం

ప్రశాంతి నిలయం: ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగానే పాఠశాల విద్యాశాఖ అధికారులు పరీక్షల నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను సైతం అమలు చేయనున్నారు.

457 హైస్కూళ్లు.. 125 కేంద్రాలు..

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ యాజమాన్యాల కింద మొత్తం 457 హైస్కూల్స్ ఉన్నాయి. 125 కేంద్రాలలో పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు. రెగ్యూలర్, ప్రైవేట్ కలిపి 25,881 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. 106 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు సైతం పరీక్షలు రాయనున్నారు.

అధికారులకు శిక్షణ పూర్తి..

పరీక్షల నిర్వహణలో కీలక పాత్ర పోషించే చీఫ్ సూపరింటెండెంట్ ఆఫీసర్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ల నియామకాలను విద్యాశాఖ అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. పరీక్షల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వీరికి డీఈఓ మీనాక్షి ఆధ్వర్యంలో ఇటీవలే శిక్షణ కార్యక్రమాన్ని సైతం నిర్వహించారు.

పోలీసుస్టేషన్‌లో ప్రశ్నపత్రాలు..

పబ్లిక్ పరీక్షల నిర్వహణకు అవసరమైన రెండు సెట్ల ప్రశ్న పత్రాలను, ఓఎమ్‌ఆర్ షీట్లు, ఇతర సామగ్రిని ఇప్పటికే జిల్లాలోని 32 మండల కేంద్రాల్లోని పోలీస్‌స్టేషన్‌లలో భద్రపరిచారు. ఈ ఏడాది లోటుపాట్లకు తావులేకుండా సిట్టింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్‌లుగా ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులనే నియమిస్తున్నారు.

అందుబాటులో హాల్‌టికెట్లు..

పది విద్యార్థులకు సంబంధించిన హాల్ టికెట్లను సైతం ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. అయితే హాల్ టికెట్‌పై సంబంధిత పాఠశాల హెడ్‌మాస్టర్ల ధ్రువీకరణ తరువాత మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు.

విద్యార్థులు, సిబ్బంది మాత్రమే...

పరీక్షా కేంద్రాలను నో సెల్‌ఫోన్ జోన్‌లుగా ఇప్పటికే ప్రకటించారు. ఎవరైనా సరే పరీక్షా కేంద్రాల బయటే సెల్‌ఫోన్ ఉంచాలని నిబంధన అమలు చేస్తున్నారు. వీటితో పాటు క్యాలిక్యూలేటర్లు, ఇయర్‌ఫోన్‌లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను కూడా అనుమతించరు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేయనున్నారు. పరీక్ష రాసే విద్యార్థులు, సిబ్బంది మినహా పరీక్షా కేంద్రాల వద్ద ఇతరులు ఉండేందుకు కూడా అనుమతించడం లేదు. పరీక్ష కేంద్రం సమీపంలోని ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్లను సైతం పరీక్షా సమయంలో మూయిస్తారు.

పది పరీక్షల నిర్వహణ ఇలా..	
జిల్లాలో పది విద్యార్థుల సంఖ్య	25,881
ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలు	125
ఇన్విజిలేటర్ల సంఖ్య	1150
చీఫ్ సూపరింటెండెంట్ ఆఫీసర్లు	125
డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు	125
ఫ్లయింగ్ స్క్వాడ్‌లు	6
సిట్టింగ్ స్క్వాడ్‌లు	4

పేజీ చినిగితే మాల్ ప్రాక్టీస్ కిందే లెక్క..

పరీక్షలను పటిష్ఠంగా నిర్వహించే క్రమంలో ఈ ఏడాది మరో కొత్త నిబంధన అమలుల్లోకి తెచ్చారు. విద్యార్థులకు ఓఎమ్‌ఆర్ షీట్‌తో పాటు 24 పేజీలు బుక్‌లెట్‌ను ఇస్తారు. ఇంకా అవసరం అనుకుంటే మరో 12 పేజీల బుక్‌లెట్‌ను తీసుకునే వీలుంది. అయితే వీటిలో ఏ ఒక్క పేజీని చింపినా మాల్‌ప్రాక్టీస్ జరిగినట్లుగానే నిర్ధారించి సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారు

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణా..

పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పించింది. ఆర్టీసీ సిబ్బందికి విద్యార్థులు హాల్ టికెట్ చూపిస్తే చాలు ఎలాంటి రుసుము చెల్లించకుండానే ప్రయాణించవచ్చు.

ఒత్తిడిని జయిస్తే విజయం



ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి ఎంతో కీలకమైంది. ఎవరూ ఒత్తిడికి గురికాకుండా ప్రణాళికా బద్ధంగా ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను చదివితే తప్పకుండా విజయం సాధిస్తారు. పరీక్షా సమయంలో విద్యార్థులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కూడా చాలా ముఖ్యం. పరీక్షలలో సాధించే ఫలితాలే అంతిమం కాదు. తక్కువ మార్కులు సాధించినా, ఫెయిల్ అయినా కృంగిపోకుండా విజయం కోసం ప్రయత్నం చేయాలి.

– బసంత్ కుమార్, కలెక్టర్, శ్రీ సత్యసాయి జిల్లా.

పకడ్బందీగా ఏర్పాట్లు



జిల్లా ఏర్పడి తరువాత మొదటి సారి పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నాం. లోటుపాట్లకు ఆస్కారం లేకుండా ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశాం. అనరమైన సిబ్బందిని నియమించడంతో పాటు పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు అనువుగా ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే అనంత సంకల్పం ద్వారా విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేశాము.

– మీనాక్షి, డీఈఓ, శ్రీ సత్యసాయి జిల్లా.

త్వరితగతిన బిల్లులు చెల్లించండి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: నియోజకవర్గంలోని జగనన్న కాలనీల్లో వైఎస్సార్ గృహ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని, త్వరితగతిన బిల్లులు చెల్లించేందుకు సహకరించాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. బిల్లుల మంజూరు అంశంపై ఆయన శుక్రవారం అసెంబ్లీలో మాట్లాడారు. నియోజకవర్గానికి 25 వేల ఇళ్లు మంజూరయ్యాయని, ఇప్పటికే సగానికి పైగా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను చేపట్టారన్నారు. లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో చెల్లించాలని గృహనిర్మాణ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ఇంటి పట్టా, ఇళ్లు మంజూరు కావాలంటే జన్మభూమి కమిటీలకు లంచాలివ్వాల్సి వచ్చేదని, అయితే నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు జగనన్న ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టాతో పాటు ఇల్లు మంజూరు చేస్తున్నారని కొనియాడారు.

ఆటోను ఢీకొన్న టెంపో

- ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు



వెంకటేష్ (ఫైల్)

మదనపల్లె: మండలంలోని బసినికొండ పంచాయతీ పాత ఆర్టీఓ ఆఫీసు సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఆటోను టెంపో ఢీకొనడంతో.. ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. మదనపల్లె పట్టణంలోని గొసియావీధికి చెందిన షేక్ ఖాజామొహిద్దీన్ టెంపో వాహనంలో బోయకొండ నుంచి కోళ్లను వేసుకుని మదనపల్లెకు వెళ్తున్నారు. అయితే పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటనకు సంబంధించి కేటరింగ్ సామగ్రిని తీసుకువెళుతున్న ఆటోను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆటోలో డ్రైవర్ పక్కన కూర్చొని ప్రయాణిస్తున్న శ్రీసత్యసాయిజిల్లా తనకల్లు మండలం ముండ్లవారిపల్లెకు చెందిన కె.వెంకటనారాయణ కుమారుడు వెంకటేష్ (35) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న చంద్రకళ (40), డ్రైవర్ సురేష్(27) తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



శ్రీనివాసులు (ఫైల్)

పెనుకొండ రూరల్: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొన్న ఘటనలో ఒకరు చనిపోయిన ఘటన పెనుకొండ జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు... పరమేశ్వరపురానికి చెందిన పూజారి శ్రీనివాసులు (50) గోనిపేట నుంచి వెళ్తుండగా స్వగ్రామానికి వెళ్తున్నారు. అయితే గోనిపేట మలుపు దగ్గర రోడ్డు దాటే క్రమంలో బెంగళూరు నుంచి అనంతపురం వైపు వెళ్తున్న కారు... బైక్‌ను ఢీకొనడంతో శ్రీనివాసులు అక్కడిక్కడే మృతి చెందారు. మృతుడు మగ్గం నేసే కూలీ అని స్థానికులు తెలిపారు. మృతునికి భార్య పద్మావతి, కుమారుడు ఉన్నారు.

వృద్ధుడి బలవన్మరణం

నల్లచెరువు: మండల కేంద్రంలోని బసవన్న కట్ట సమీపంలో నివాసముండే పెద్దయల్లంపల్లికి చెందిన ప్రభాకర్‌నాయుడు (65) అనే వృద్ధుడు ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. అనారోగ్య కారణాలతోనే ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎస్‌ఐ వరలక్ష్మి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

సందడిగా ఉట్లమాను పరుష



ఉట్లమాను వేడుకను తిలకిస్తున్న ప్రజలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని దుర్గమ్మ ఆలయం పక్కన శుక్రవారం నిర్వహించిన ఉట్లమాను పరుష వైభవంగా జరిగింది. ఉగాది పండుగ అనంతరం దుర్గమ్మ ఆలయం దగ్గర ఉట్లమాను పరుష నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దుర్గమ్మ ఆలయంలో ఉట్లమాను కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బోయ కులస్తులు దుర్గమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉట్లమాను పరుస నిర్వహించారు. ఉట్లమాను ఎక్కుతున్న యువకులను ప్రోత్సహిస్తూ ప్రజలు కేరింతలు, చప్పట్లు కొట్టారు. ఉట్లమాను ఎక్కిన బోయ వీధికి చెందిన సాకే జనార్దన్‌కు రూ.10,116 బహుమతిగా అందించారు.

అక్రమాలపై నిగ్గు తేల్చండి

- రూ.110 కోట్ల భూమిని రూ.2.80 కోట్లకే కట్టబెట్టారు
- రామగిరి గ్రానైట్ రవాణాలోనూ రూ.1000 కోట్ల దోపిడీ
- బినామీ పేర్లతో భూముల రిజిస్ట్రేషన్
- విజిలెన్స్ విచారణకు రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి డిమాండ్



రాప్తాడురూరల్: టీడీపీ హయాంలో రాప్తాడు నియోజకవర్గంలో జరిగిన అక్రమాలపై నిగ్గు తేల్చాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కోరారు. రాప్తాడు సమీపాన పేజ్ ఇండస్ట్రీస్‌కు రూ.కోట్లు విలువైన భూములను కారుచౌకగా కట్టబెట్టిన వైనంపై విజిలెన్స్ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం అసెంబ్లీలో జీరో అవర్‌లో మాట్లాడారు. నారా లోకేష్ పరిశ్రమల మంత్రిగా ఉన్నప్పుడు పేజ్ ఇండస్ట్రీస్ అనే సంస్థకు జాతీయ రహదారి పక్కన 28 ఎకరాల భూమిని, ఎకరం రూ.10 లక్షల చొప్పున కేటాయించారన్నారు. అంటే రూ.2.80 కోట్లకు 28 ఎకరాల భూమిని రిజిష్టర్ చేశారన్నారు. వాస్తవానికి ఆ భూమి ఎకరం రూ.4 కోట్లు చేస్తుందన్నారు. ఈ లెక్కన ఆ భూమి విలువ రూ.110 కోట్లు అవుతుందన్నారు. ఆ సంస్థ మూడేళ్లలో ఆ భూమిని అమ్ముకునేలా జీఓ కూడా ఇచ్చారన్నారు. 2016లో భూములు ఇచ్చినా 2019 వరకు ఆ సంస్థ ఈ ప్రాంతానికే రాలేదన్నారు. జీఓ మీద, ఆ సంస్థకు కేటాయించిన భూముల మీద విజిలెన్స్ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. అయితే పచ్చ మీడియా.. తప్పుడు కథనాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందన్నారు. దోపిడీ, స్కాములకు గత ప్రభుత్వం తెరలేపిందన్నారు.


రాయల్టీ లేకుండానే గ్రానైట్ తరలించేశారు..

రామగిరి గ్రానైట్‌కు సంబంధించి నసనకోట, మాదాపురం పంచాయతీల్లో ఎన్నో ఫ్యాక్టరీలకు లీజులు ఇచ్చారని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే ఆయా ఫ్యాక్టరీల నిర్వాహకులు రాయల్టీ చెల్లించడం లేదన్నారు. అనేకమార్లు విచారణ చేయించాలని తాను కోరానన్నారు. ఈ గ్రానైట్‌లో దాదాపు వెయ్యి కోట్ల దాకా కుంభకోణం జరిగిందన్నారు. రాయల్టీలు చెల్లించకుండా తరలించిన గ్రానైట్‌పైనా విజిలెన్స్ విచారణకు ఆదేశించాలని కోరారు. జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్లు, మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల పరిధిలో ప్రభుత్వ భూములను సాగుకు కేటాయించకూడదనే నిబంధన ఉందని, ప్రభుత్వ అవసరాలకు మాత్రమే వినియోగించాలని ఉందని గుర్తు చేశారు. 2012లో 271 జీఓ వచ్చిన తర్వాత అనంతపురం రూరల్ మండలం, రాప్తాడు మండలాల్లో రూ.వందల కోట్లు విలువ చేసే భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించారన్నారు. సాగు చేయకపోయినా, ఆ భూములపై ఎలాంటి హక్కులు లేకపోయినా కొంతమంది బినామీల పేర్లు ఎక్కించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారన్నారు. ముఖ్యంగా మాజీ సైనికులకు కేటాయిస్తున్నామంటూ పాత తేదీలతో రికార్డుల్లో ఎక్కించి ఆన్‌లైన్ చేశారన్నారు. పెద్ద ఎత్తున భూ దోపిడీ జరిగిందన్నారు. దీనిపై కూడా విజిలెన్స్ విచారణ చేయాలని కోరుతున్నామన్నారు.

విప్లవ యోధుడు.. ముడార్ వేణుగోపాల్

- అనంత వాసుల్లో విప్లవ బీజాలు నాటిన అభ్యుదయవాది
- జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు
- ముడార్ ఉగాది పురస్కారాలు అందించనున్న నిర్వాహకులు

సందర్భం : రేపు ముడార్ వేణుగోపాల్ విగ్రహావిష్కరణ



సజీవత ఉట్టిపడేలా ఉన్న ముడార్ వేణుగోపాల్ విగ్రహం

అనంతపురం కల్చరల్: విప్లవయోధుడు... అభ్యుదయ కవిత్వాన్ని పండించిన కవి.. నిబద్ధత కల్గిన పాత్రికేయుడు.... విశ్రాంత ఉద్యోగుల సంక్షేమం కోసం పోరాడిన ఉద్యమకారుడు... విలక్షణ జీవితంతో అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచిన వ్యక్తి ముడార్ వేణుగోపాల్. ఆయన జయంతి వేడుకను ప్రజాహిత సాహితీ సంస్థ సభ్యులు స్ఫూర్తిదాయకంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు అనంతపురం నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించునున్నారు.

అవినీతికి వ్యతిరేకంగా తిరుగుబాటు

మహాకవి శ్రీశ్రీ , విప్లవ యోధుడు తరిమెల నాగిరెడ్డి, గద్దర్, కొండపల్లి సీతారామయ్య, వరవరరావు, దిగంబర కవులతో కలిసి పనిచేస్తూ అనంత వాసుల్లో అభ్యుదయ భావజాలాన్ని రేకెత్తించిన విప్లవ జ్యోతి ముడార్ వేణుగోపాల్ జీవితం ఆద్యంతం పోరాటమయం. 1936 మార్చి 24న సామాన్యమైన సంప్రదాయ కుటుంబంలో వేణుగోపాల్ జన్మించారు. అభ్యుదయ భావాలు అధికంగా ఉండటంతో యువకుడిగా ఉన్నప్పుడే పాలకుల అవినీతికి వ్యతిరేకంగా నాటి కమ్యూనిస్టు నాయకులతో కలిసి తిరుగుబాటు జెండా ఎగురవేశారు. 1975లో దేశవ్యాప్తంగా ఎమర్జెన్సీ కాలంలో విప్లవ జ్వాలాలు రగులుకున్న సమయంలో ఆయన పాలకులను ఎదిరించి 18 నెలల పాటు కారాగార శిక్షనను అనుభవించి ఉద్యోగాన్ని సైతం పోగొట్టుకున్నాడు. 'చైతన్య సాహితి' సంస్థ ద్వారా ఆయన నాటిన విప్లవ బీజాలు నేటికీ ఎంతో మందిని పోరాటం వైపు నడిపిస్తున్నాయి. 2020 జూన్ 11న ఆదర్శభావాలను అనుచరులలో నింపి కానరాని లోకాలకు వెళ్లిపోయారు.



ఓ సభలో ప్రసంగిస్తున్న ముడార్ వేణుగోపాల్ (ఫైల్)

జీవితమంతా పోరాటమే..

ముడార్ వేణుగోపాల్ యువకుడిగా ఉన్న సమయంలో ఆయన అవినీతిని చెండాడుతూ రచించిన 'బంధూక' 'రక్తగానం' పుస్తకాలను నాటి ప్రభుత్వం నిషేధించింది. దేశద్రోహం కింద జైలుకు కూడా పంపింది. కానీ ఆయన పోరాటాన్నే మార్గంగా ఎంచుకోవడంతో ఎన్ని కష్టాలు అనుభవించినా సామాన్యుల స్వేచ్ఛాయుత జీవనం కోసం పోరాటం చేశారు. విరసం పెద్దల సూచనతో తన సంస్థను అందులో విలీనం చేశారు. కొంత కాలం జర్నలిస్టుగా కూడా విప్లవ వార్తలను పత్రికా ప్రపంచానికి అందించారు. పదవీ విరమణ తర్వాత 'ప్రజాహిత సాహితీ' సమితిని స్థాపించి సాహిత్యాభిమానుల, సాహితీవేత్తల కృషికి తోడ్పాటునందించారు.

వైఎస్సార్‌పై అంతులేని అభిమానం

ఓ వైపు పీడిత, తాడిత ప్రజల పక్షాన పోరాడుతూనే దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డిలో నిజమైన సోషలిస్టు ఉన్నాడని పలు సభల్లో చెప్పారు. వైఎస్సార్ పట్ల వీరాభిమానం కనపరిచే ముడార్ వేణుగోపాల్‌ను ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన వైఎస్సార్ మరణం ఎంతో కుంగదీసింది. ఆ బాధను జీర్ణించుకోలేకనే ఆయన 'జయహో' పేరిట కవితా సంకలనాన్ని వెలువరించారు. వైఎస్సార్‌కు పేరు తెచ్చిపెట్టిన 108 నంబర్‌కు గుర్తుగా కవితలతో ఆవిష్కరించిన పుస్తకం ఎంతో మందిని ఆకట్టుకుంది. పరిశ్రమలశాఖలో పదవీ విరమణ అనంతరం పెన్షనర్ల అభ్యున్నతికి తీవ్రంగా శ్రమించారు. అయితే నాటి ప్రభుత్వం అండతో కొంత మంది నాయకులు వైఎస్సార్ చిత్రపటాన్ని సంఘం కార్యాలయంలో తొలగించడంతో వచ్చిన విబేధాల వల్ల సొంతంగా 'విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం' పేరుతో కొత్త సంఘాన్ని ఏర్పాటు చేసి విశ్రాంత ఉద్యోగుల సమస్యల పట్ల రాజీ లేని పోరాటం చేశారు.

రేపు ముడార్ ఉగాది పురస్కారాలు..

చిరస్మరణీయంగా నిలిచే యోధుల్లో ఒకరైన ముడార్ వేణుగోపాల్ 84వ జయంతి సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ప్రజాహిత సాహితీ సంస్థ నిర్వాహకులతో పాటూ ఆయనతో కలిసి పనిచేసిన సహచరులు ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ముడార్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. సజీవత ఉట్టిపడేలా ఉన్న విగ్రహాన్ని ఆయన కుటుంబ సభ్యులు విదేశీ సాంకేతిక సహకారంతో తయారు చేయించారు. అదేవిధంగా ఆయనతో కలిసి పనిచేసిన వారి ప్రసంగాల అనంతరం, ఆయన జయంతి సందర్భంగా నిర్వహించిన ఉగాది కవితల పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి 'ముడార్ వేణుగోపాల్ ఉగాది పురస్కారాలను అందించనున్నారు. జిల్లా అభ్యుదయ సాహిత్యాన్ని విప్లవ మార్గంలో నడిపించిన ముడార్ జయంతి వేడుకల్లో పాల్గొనాలని ప్రజాహిత సాహితి నిర్వాహకులు ముడార్ సుధీర్ విజ్ఞప్తి చేశారు.